సాక్షి
రంగారెడ్డి
ఆదివారం | 5 | జనవరి | 2025



వంద పడకల ఆస్పత్రి

పరిగి ప్రభుత్వాస్పత్రిని వంద పడకలకు పెంచేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఓవర్‌టేక్ చేయబోయి..

కారును ఓవర్‌టేక్ చేయబోయిన లారీ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. 8లో▸



ఆశయ సాధనకు కృషి

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

డీఎల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ డిగ్రీ మహిళా కళాశాల (వికారాబాద్)లో ఉపాధ్యాయుల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ తెలిపారు. డీఎల్ కంప్యూటర్ సైన్స్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ డిగ్రీ కళాశాలలో ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఒర్జినల్ సర్టిఫికెట్లు, ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఉపాధిహామీ ఉద్యోగులు



ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టర్ సి.నారాయణ రెడ్డిని ఉపాధి హామీ ఉద్యోగులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్‌డీఓ శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కందుకూరి నాగభూషణం నాయకత్వంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో పాటు నోటుబుక్స్, పెన్నులు, టవల్స్ అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ చరణ్‌గౌతమ్, ఎఫ్‌ఎం శారద, సూపరింటెండెంట్ ప్రసాద్, జేఏసీ నాయకులు రవీందర్‌రెడ్డి, వీరాసింగ్, లలిత, నర్సిములు, తిరుపతాచారి, రవికుమార్, విమల, శివశంకర్‌రెడ్డి, సంధ్య, కరుణశ్రీ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చించోడ్‌లో సంపూర్ణ మద్య నిషేధం



మద్య నిషేధంపై తీర్మానం చేసిన గ్రామస్తులు

షాద్‌నగర్: మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా.. పేకాట ఆడినా.. ఎన్నికల్లో ఓట్ల కోసం మద్యం పంపిణీ చేసినా జరిమానా విధించాలని ఆ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళా సంఘాల సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పేకాట, మద్యపానాన్ని నిషేధించాలని తీర్మానించారు. మద్యం అమ్మిన వారికి రూ.50వేలు, కొనుగోలు చేసిన వారికి రూ.25వేలు, పేకాట ఆడిన వారికి రూ.50వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. దీనిని ఎవరైనా వ్యతిరేకిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని తీర్మానించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజలను మభ్య పెట్టేందుకు మద్యం పంపిణీ చేసే నాయకులు, వారికి సహకరించే వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తామని తీర్మానంలో పేర్కొన్నారు.

అమృతాసాగర్‌కు సావిత్రిబాయి పూలే అవార్డు



అమృతాసాగర్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క తదితరులు

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన అమృతాసాగర్‌కు సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. అమృతాసాగర్ మహిళల సమస్యలు, సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాల సందర్భంగా ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం రవీంద్రభారతిలో అవార్డుల ప్రదానం చేసింది. ఈ మేరకు ఆమెకు మంత్రి సీతక్క, మాజీ ఎంపీ హనుమంత్‌రావు చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అమృతాసాగర్ మాట్లాడుతూ.. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.



క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ఆట బాట

శిక్షణకు చిరునామా సరూర్‌నగర్ స్టేడియం

- ఆయా క్రీడాంశాల్లో నిత్యం తర్ఫీదు
- యువ ఆటగాళ్లను తీర్చిదిద్దుతున్న కోచ్‌లు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: ఆటల్లో రాణించాలనుకునే చిన్నారులకు సరూర్‌నగర్ ఇండోర్–అవుట్‌డోర్ స్టేడియం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇక్కడ శిక్షణ పొందుతున్న అనేక మంది యువ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. అథ్లెటిక్స్, స్కేటింగ్, హాకీ, క్రికెట్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, కరాటే, టెన్నిస్, ఖోఖో, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో ఇక్కడ తర్ఫీదు ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో 1,500 మంది చిన్నారులు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ తీసుకుంటున్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిసి..

ఇప్పటికే ఇక్కడ శిక్షణ పొందిన చందన అండర్–23 జాబితాలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటోంది. ప్రస్తుతం భారత క్రికెట్ మండలి గోవాలో నిర్వహించే పోటీల్లో హైదరాబాద్ జట్టు తరఫున ఆడుతోంది. అథ్లెటిక్స్‌లో హరిణి అనే క్రీడాకారిణి రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. క్రికెట్‌లో దివ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. ఇలా ఎంతో మంది క్రీడాకారులకు ఇక్కడి స్టేడియం భవిష్యత్ స్టార్లను అందించే నిలయంగా నిలుస్తోంది.



స్కేటింగ్‌లో సాధన చేస్తున్న చిన్నారులు

క్రీడాంశాలు.. కోచ్‌ల వివరాలు

జిమ్నాస్టిక్స్	స్వర్ణలత	81484 50218
బ్యాడ్మింటన్	ఫణికిషోర్	98660 95912
వాలీబాల్	రమాదేవి	90009 92041
క్రికెట్	రాజశేఖర్	99121 14789
స్విమ్మింగ్	సంజయ్‌సింగ్	97008 82801
టెన్నిస్	మధుసూదన్‌చారి	96662 81961
స్కేటింగ్	యాదయ్య	93466 62588
అథ్లెటిక్స్	సాయిబాబారెడ్డి	97038 38978
బాస్కెట్‌బాల్	సైదులు	99088 01432

– శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు పై నంబర్లతో పాటు స్టేడియం కార్యాలయ 040–24032833 నంబర్‌లో కూడా సంప్రదించొచ్చు.

ఆత్మస్థైర్యం నింపుతాం



క్రీడలపై ఆసక్తి ఉండడం ఒక్కటే సరిపోదు. అందులో రాణించాలంటే ముందు మైదానంలోకి అడుగు పెట్టడం నేర్చుకోవాలి. అదే అలవాటు క్రీడల్లో రాటుదేలేలా చేస్తుంది. రోజువారీగా సాధన చేయాలి. కోచ్‌లు అందుబాటులో ఉన్నారు. నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపుతారు. క్రమశిక్షణ అలవడుతుంది. – రాజశేఖర్, క్రికెట్ కోచ్

దేశానికి ప్రాతినిధ్యమే లక్ష్యం



ఇక్కడ తీసుకున్న శిక్షణ ఎంతో ఉపయోగపడింది. క్రికెట్ మహిళా జట్టుకు జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సాధన మాత్రం ఆపను. భవిష్యత్తులో దేశం తరఫున ఆడి గుర్తింపు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తా. – చందన, క్రీడాకారిణి

అంతర్జాతీయ ప్రమాణాలతో..



స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నాం. ఇక్కడ వేలాది మంది విద్యార్థులు, యువత శిక్షణ తీసుకుంటున్నారు. – వెంకటేశ్వరరావు, డీఎస్‌డీఓ

సావిత్రి స్ఫూర్తి.. ఉపాధ్యాయ కీర్తి

- కష్టాలను జయించి.. సమాజానికి దిక్సూచిగా నిలిచి
- టీచర్లుగా రాణిస్తూ అందరికీ ఆదర్శంగా..

సండే స్పెషల్

పేదరికం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ సమస్యలు చుట్టుముట్టినా వారి విజయాన్ని అడ్డుకోలేకపోయాయి.. పట్టుదల.. అకుంఠిత దీక్షతో ముందుకు సాగారు.. ఎంచుకున్న లక్ష్యం కోసం శ్రమించారు.. అందుకు తగ్గ ఫలితం లభించింది.. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించిన నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం



- వివరాలు 8లో▸

మహిళా సంక్షేమమే ధ్యేయం

- కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సీతక్క

షాద్‌నగర్/నందిగామ/షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నందిగామ మండలం అప్పారెడ్డి గూడ, వీర్లపల్లి, వెంకమ్మగూడ, చేగూరు గ్రామాల్లో శనివారం ఆమె స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మధురాపూర్‌లో రూ.15లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, రూ.35లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించారు. రూ.8కోట్లతో నిర్మిస్తున్న కమ్మదనం, శేరిగూడ, బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నందిగా మండలం అప్పారెడ్డిగూడలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన పంచాయతీ భవనానికి శంకుస్థాపన, సీఆర్‌ఆర్ నిధులు రూ. 19.4 కోట్లతో షాద్‌నగర్ నుంచి బండోనిగూడ వరకు చేపట్టిన డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి వీర్లపల్లిలో శంకుస్థాపన, సీఆర్‌ఆర్ నిధులు రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న చేగూరు నుంచి సింబయాసిస్ యూనివర్సిటీ వరకు డబుల్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ వారి ప్రగతికి తోడ్పాటు అందించారని.. అదే బాటలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మహిళా సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుతుంటే ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. అనంతరం మధురాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు రూ.50కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును మంత్రి అందజేశారు. ఉమ్మడి చేగూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వచ్చిన వినతులను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఉపాధి కల్పించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, విశాల, మాజీ ఎంపీపీలు, ఇతర నేతలు పాల్గొన్నారు.



మధురాపూర్‌లో మహిళా సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న హైడ్రా అధికారుల బృందం (ఫైల్)

'హైడ్రా' గుబులు

- ఇటీవల మాసబ్ చెరువును పరిశీలించిన హైడ్రా బృందం
- తమ కార్యాలయానికి రావాలని ఆదిత్యానగర్ కాలనీవాసులకు సూచన
- ఏం జరుగుతుందోనని స్థానికుల్లో మొదలైన ఆందోళన

తుర్కయంజాల్: హైడ్రా బృందాల పర్యటనలు స్థానికుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కొంతమంది అధికారులు ఇటీవల పురపాలక సంఘం పరిధిలోని మాసబ్ చెరువును పరిశీలించిన విషయం తెలిసిందే. ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి పర్యటించి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను పరిశీలించారు. అనంతరం ఆదిత్యానగర్ కాలనీ వాసులతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు చెరువుల పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నోటీసులు ఇచ్చిన కొన్ని గంటల్లోనే కూల్చివేతలు చేపట్టడంతో ఆదిత్యానగర్ కాలనీవాసుల్లోనూ టెన్షన్ మొదలైంది.

మొత్తం 527.27 ఎకరాలు

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 14, 26, 35, 36, 58, 59, 60, 61, 65, 66, 67, 68, 69, 70, 71, 72, 73, 74, 75, 76, 77, 78, 116 నుంచి 166 వరకు.. 168, 169, 170, 171, 172, 173, 193, 194, 195, 196, 203, 204, 205లోని ప్రభుత్వ భూమి 342 ఎకరాల 34 గుంటలు, పట్టా భూమి 152 ఎకరాల 38 గుంటల భూమి ఎఫ్‌టీఎల్ కలిగి ఉంది. అదేవిధంగా సర్వే నంబర్లు 14, 26, 35, 36, 58, 60, 61, 65, 66, 67, 68, 75, 76, 77, 78, 116, 167, 169, 172, 173, 193, 194, 195, 196, 203, 204, 205లోని 9 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమి, 22 ఎకరాల 05 గుంటల పట్టా భూమి బఫర్ జోన్‌గా ఉంది. మొత్తం 527.27 ఎకరాల విస్తీర్ణం కలిగిన మాసబ్ చెరువు జిల్లాలోని పెద్ద చెరువుల్లో ఒకటి.

500కుపైగా ఓపెన్ ప్లాట్లు


ఆదిత్యా నగర్ ఫేజ్ 2 సర్వే నంబర్‌లో 58, 59, 60, 61 పార్ట్, 62, 63లో విస్తరించి ఉంది. 35, 36 సర్వే నంబర్లలో ఫేజ్ 4 ఉంది. ఈ సర్వే నంబర్లలోని సుమారు 500కు పైగా ఓపెన్ ప్లాట్లు, 45 నుంచి 50 ఇళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. అదేవిధంగా సర్వే నంబర్లు 160, 161, 163, 164, 165, 166, 167, 169లోని గంగిరెడ్డి నగర్, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్ వెంచర్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి. వీటిల్లోనూ పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. ఇవే కాకుండా పలు సర్వే నంబర్లలో కొంతమంది రియల్టర్లు చెరువును చెరబట్టి ప్లాట్లుగా మార్చి అమాయకులకు కట్టబెట్టారు.

ఇబ్బంది పెట్టొద్దు

హైడ్రా అధికారులు ఈ నెల 6న కార్యాలయానికి రావాల్సిందిగా కాలనీవాసులకు సమాచారం అందించారు. కాలనీలోని సర్వే నంబర్లకు సంబంధించిన డ్యాక్యుమెంట్లను సమర్పించాలని కోరారు. ఇల్లు నిర్మించుకుని కొన్నేళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. హైడ్రా మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. – రేనా రెడ్డి, ఆదిత్యా నగర్

సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైంది

పంజగుట్ట: సనాతన ధర్మం అంటే ఎప్పటికప్పుడు తమలోని విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ కాలంతో పాటు ధర్మాన్ని ఆచరించడమేనని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భాగ్యనగర్ భారతీయ సాంస్కృతిక సమ్మేళనం శనివారం రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. చాలా మంది ధర్మం అంటే మతం మాత్రమేనని అపోహలో ఉన్నారని.. ధర్మం అంటే అన్ని మతాలను, కులాలను, వర్గాలను సమ దృష్టితో చూస్తూ వారందరినీ ప్రగతిలో భాగస్వాములను చేయడమేనన్నారు. భారతీయ సంస్కృతి ఎంత ఉన్నతమైందో సనాతన ధర్మం కూడా అంతకంటే ఉన్నతమైందన్నారు. ప్రస్తుత తరుణంలో చంద్రుడిపైకి ఎలా వెళ్లాలనేది నేర్చుకున్నాం కానీ ఐకమత్యంతో అందరూ కలిసి ఎలా జీవించాలి అనే విషయంలో ఇంకా పూర్తి స్థాయిలో నేర్చుకోలేదని అనిపిస్తోందన్నారు. సర్వేజన సుఖినోభవంతు అనే భావనను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిలో భగవంతుడున్నాడని, అదే విధంగా అన్ని చోట్లా భగవంతుడు ఉన్నాడనే భావన భారతీయ సంస్కృతిలోనే మిళితమై ఉందన్నారు.



అమరవాణి ఫౌండేషన్ టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

చేయూతనిస్తే..పతకం తెస్తా



సీఎం కప్ పోటీల్లో 59 కేజీల విభాగంలో వెయిట్‌లిఫ్టింగ్ చేస్తున్న అంజలి



వికారాబాద్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అంజలి

- సీఎం కప్ స్టేట్ విన్నర్ నీరటి అంజలి
- వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటుతున్న పేదింటి బిడ్డ
- జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

కుల్కచర్ల: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తనదైన ప్రతిభను చాటుతూ దూసుకెళ్తోంది వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన విద్యార్థి నీరటి అంజలి. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో సత్తాచాటింది. హకీంపేట్ క్రీడా పాఠశాల తరఫున ప్రాతినిధ్యం వహించిన అంజలి అండర్– 19 వెయిట్ లిఫ్టింగ్ 59 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. గత జూలైలో మధ్యప్రదేశ్, నవంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్ తదితర ప్రాంతాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ విశేషంగా రాణించింది. ఈనెల 6న ఒడిశాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొనేందుకు సిద్ధమైంది.

కుటుంబ నేపథ్యం

అంజలి ప్రస్తుతం హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు లక్ష్మి, శివరాజ్‌ల రెండో కూతూరు. వీరిది వ్యవసాయ కుటుంబం. తల్లి లక్ష్మి మహిళా సమాఖ్యలో ఎంఏసీ సీగా పనిచేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం

అంజలి తండ్రి శివరాజ్ ఐదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి వీరి కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమవుతోంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఒక్కో రాష్ట్రంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఒడిశాలో జరిగే పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దాతలు చేయూతనిస్తే రాష్ట్రానికి పతకం తెస్తానని అంజలి ధీమా వ్యక్తం చేస్తోంది.

టార్గెట్ ఒలింపిక్స్..

ప్రస్తుతం 59కేజీల విభాగంలో రాణిస్తున్న అంజలి తన టార్గెట్ ఒలింపిక్స్ అని చెబుతోంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాగుతున్నానని, కానీ పేదరికం తన సంకల్పానికి అడ్డుపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆర్థికంగా ప్రోత్సహించేవారు ఉంటే ఎంతటి కష్టాన్నయినా ఎదుర్కొని దేశానికి పేరు తెస్తానని చెబుతోంది. ఆపన్న హస్తం అందించేవారు అంజలి తండ్రి శివరాజ్ ఫోన్ పే నంబర్ 9666880366కు సాయం చేయొచ్చు.

ఆరుగురిలో ముగ్గురు టీచర్లు..

అనంతగిరి: నవాబుపేట మండలం మీనపల్లి కలాన్‌కు చెందిన రాములు, అనంతమ్మలకు ఆరుగురు కూతుళ్లు. వీరిలో రెండో కూతురు మహేశ్వరి పూడూర్ మండలం చీలాపూర్‌లో, నాలుగో కూతురు మంజుల మర్పల్లికలాన్‌లో, ఐదో కూతురు పూలమ్మ పులుమామిడిలో టీచర్లుగా పనిచేస్తున్నారు. మూడో కూతురు విజయ నాగర్‌కర్నూల్‌లో నర్స్‌గా, పనిచేస్తున్నారు. చిన్న కూతురు హేమలత ప్రస్తుతం డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నారు.


ఆరుగురు అక్కాచెల్లెళ్లు

ముగ్గురూ ముగ్గురే..

అనంతగిరి: దోమ మండలం దొంగఎన్కెపల్లికి చెందిన పద్మమ్మ, వెంకట్‌రెడ్డి దంపతులకు ముగ్గురూ అమ్మాయిలే. వ్యవసాయం చేసి, పిల్లలను బాగా చదివించారు. వీరిలో పెద్ద కూతురు స్వప్న ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఉపాధ్యాయురాలిగా, కవిత చేవెళ్లలోని జ్యోతిబాపూలే పాఠశాలలో జేఎల్‌గా, మూడో కూతురు జ్యోతి ధారూరు మండలం పీసీఎం తండాలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.


స్వప్న-కవిత-జ్యోతి

మొక్కవోని సంకల్పం

కుల్కచర్ల: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన జగన్, లక్ష్మమ్మ దంపతుల కూతురు అరుణ. చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు.. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటూ ఇంటర్ పూర్తి చేసింది. పిల్లలకు ట్యూషన్ చెబుతూ డైట్ పూర్తి చేసి ఎస్జీటీ ఉద్యోగం సాధించింది. పీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది.


టీచర్ అరుణ

ముగ్గురిలో ఇద్దరు..

అనంతగిరి: ధారూర్ మండల కేంద్రానికి చెందిన సత్యమ్మ- రత్నయ్యలకు ముగ్గురు అమ్మాయిలు, ఓ అబ్బాయి సంతానం. వ్యవసాయ భూమి లేకపోవడంతో కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివించారు. వీరిలో విజయలక్ష్మి నవాబుపేటలో, ఐశ్వర్య పెద్దేముల్ మండలం ఊరెంటి తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయినులుగా పనిచేస్తున్నారు. మరో కూతురు స్వాతి దోర్నాలలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.


విజయలక్ష్మి-స్వాతి-ఐశ్వర్య

డబుల్ ధమాకా..

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎల్‌ఐజీ కాలనికి చెందిన మహ్మద్ సాబేర్ ప్రైవేటు ఉద్యోగి. ఈయనకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు సంతానం. కూతుళ్లు నిఖత్ ఉన్నీసా, షాహీన్ ఉన్నీసా గత డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. నిఖత్ ఉన్నీసా ప్రస్తుతం కోట్‌పల్లి మండలం ఇందోల్‌లో, షాహీన్ ఉన్నీసా బషీరాబాద్ మండలం మైల్వార్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.


నిఖత్ ఉన్నీసా, షాహీన్ ఉన్నీసా

సావిత్రి స్ఫూర్తి.. ఉపాధ్యాయ కీర్తి

సండే స్పెషల్



మేనమామల ప్రోత్సాహంతో..


రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంటున్న మాధురి

యాలాల: వికారాబాద్ మండలం ఆలంపల్లికి చెందిన మాధురి చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు చనిపోయారు.. మేనమామలు చేరదీసి చదివించారు.. వారి శ్రమ వృథా కారాదని పట్టుదలతో చదివింది.. 1988లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి.. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టీచర్‌గా నిలిచింది.. తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచింది. మేనమామలు బస్వరాజ్, బస్వలింగం, రాజేశ్వర్ ప్రోత్సాహం మరువలేనిదని పేర్కొంది. తనకు బాల్యంలో పాఠాలు చెప్పిన మల్లయ్య టీచరును ఆదర్శంగా తీసుకొని ఈ స్థాయికి ఎదిగినట్లు మాధురి తెలిపారు. గతేడాది పదోన్నతిపై జీహెచ్ఎంగా దేవనూరు ఉన్నత పాఠశాలకు వచ్చారు. 2016లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు.

అక్కాచెల్లెళ్లంతా టీచర్లే..


అక్కా చెల్లెళ్లు పద్మజ, గీత, కవిత

బొంరాస్‌పేట: దౌల్తాబాద్ మండల నందారానికి చెందిన నాగమణి, గోపాల్‌రెడ్డి దంపతులకు ముగ్గురు కూతుళ్లు పద్మజ, గీత, కవిత. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు కష్టపడి చదివి ప్రభుత్వ టీచర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. తల్లిదండ్రుల కష్టానికి తగిన గుర్తింపు తెచ్చారు. ప్రస్తుతం ముగ్గరూ కొడంగల్ నియోజవర్గంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

భర్త చనిపోయిన బాధను దిగమింగి..

పరిగి: వికారాబాద్ పట్టణానికి చెందిన అనురాధ భర్త 1997లో చనిపోయాడు.. అప్పటికే ఆమెకు ఇద్దరు చిన్న పిల్లలు.. భర్త లేడన్న పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనుకుంది. కష్టపడి చదువుకుంది. 2008 డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం వికారాబాద్ ఎంపీపీఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.


పాఠాలు బోధిస్తున్న అనురాధ

వైకల్యాన్ని జయించి..

బషీరాబాద్: మండలంలోని మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన మాల బిచ్చప్ప, మాణిక్యమ్మ దంపతుల కూతురు జగ్గమ్మ. ఏడాది వయస్సులో పోలియో బారిన పడి కాలు చచ్చుబడింది.. చదువుపై మక్కువతో సొంత గ్రామంలో 5వ తరగతి వరకు చదువుకుంది.. బషీరాబాద్ జెడ్పీ బాలికల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకుంది. తాండూరులో ఇంటర్, వికారాబాద్‌లో డీఎడ్ పూర్తి చేసింది. అంగవైకల్యంతో అంతపెద్ద చదువులు చదువుతావా..? అని వెక్కిరించిన గొంతుకలకు సమాధానం చెప్పాలనుకుంది.. కష్టపడి చదువుకుంది.. 2012 డీఎస్సీలో ఎస్జీటీ టీచర్‌గా ఉద్యోగం సాధించింది. ఆడవాళ్లు అనుకుంటే ఏదైనా సాధిస్తారని నిరూపించింది. ప్రస్తుతం బషీరాబాద్ మండలం నవల్గా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తోంది.


జగ్గమ్మ

తండ్రిబాటలో నలుగురు..

తాండూరు రూరల్: తాండూరు పట్టణం సాయిపూర్ భవానీనగర్‌కు చెందిన హన్మయ్య, సూర్యకళ దంపతులకు ఆరుగురు ఆడపిల్లలు.. హన్మయ్య మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి 2017లో ఉద్యోగ విరమణ పొందారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాల్లోనే చదివించారు.. ప్రస్తుతం వారు ప్రభుత్వ ఉద్యోగులు సాధించారు.. మొదటి కూతురు సీహెచ్ సంధ్యారాణి (ఎస్ఏ, ఫిజికల్ సైన్స్), స్వరూపరాణి (ఆర్ట్ టీచర్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్), భార్గవి(ఏఈఈ, పంచాయతీ రాజ్ విభాగం), అర్చన(పంచాయతీ కార్యదర్శి, ఇందర్‌చెడ్), అశ్విని(ఎస్జీటీ, ఇందూర్ పాఠశాల), హారిక (ఎస్జీటీ) బాగాయిపల్లిలో టీచర్‌గా పని చేస్తున్నారు.


ఉద్యోగాలు సాధించిన కూతుళ్లతో తల్లిదండ్రులు

పేద కుటుంబంలో పుట్టి..



ఆలేడ్‌లో పాఠాలు బోధిస్తున్న గౌతమి

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన గౌతమి, ప్రసన్నలక్ష్మి అక్క చెల్లెల్లు. వారిని తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. ఇద్దరూ 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేశారు. ప్రస్తుతం గౌతమి దుద్యాల్ మండలం ఆలేడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తుండగా.. ప్రసన్నలక్ష్మి కొడంగల్ మండల రుద్రారం పాథమిక పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది.


రుద్రారంలో బోధిస్తున్న ప్రసన్నలక్ష్మి

నాన్నను కోల్పోయినా..

బొంరాస్‌పేట: తాండూరుకు శశివర్ధ చిన్నతనంలోనే నాన్నను కోల్పోయారు. దీంతో అన్నీ తానై అమ్మే చదివించింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా తల్లి ప్రోత్సాహంతో పట్టుదలగా చదివారు. చివరికి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం బొంరాస్‌పేట మండలంలో విధులు నిర్వర్తిస్తున్నారు.


తల్లి పార్వతమ్మతో శశివర్ధ

అమ్మే ఆదర్శం..

పరిగి: మాది కుల్కచర్ల మండలం గట్టనపల్లి.. నేను చిన్నగా ఉన్నప్పుడు అమ్మ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పేది.. తాను కూడా తల్లిలా టీచర్ కావాలనుకున్నా.. అమ్మే నాకు ఆదర్శం అని ప్రియాంక తెలిపింది.. కష్టపడి చదివి 2017లో టీచర్ ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఇప్పాయిపల్లిలో విధులు నిర్వహిస్తోంది.. కష్టపడితే ఏదైనా సాధ్యమని అంటోంది.


టీచర్ ప్రియాంక

కారును ఓవర్‌టేక్ చేయబోయి..

- ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన లారీ
- గాయపడిన నలుగురు స్నేహితులు

మహేశ్వరం: కారును ఓవర్‌టేక్ చేయబోయిన లారీ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం తుమ్మలూరు గేటు సమీపం శ్రీశైలం జాతీయ రహదారి మ్యాక్ ప్రాజెక్టు ఎదుట చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలను మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని మణికొండ, కొండాపూర్‌కు చెందిన నలుగు స్నేహితులు శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా.. హైదరాబాద్ నుంచి కందుకూరు వైపు ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ.. ముందుగా వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న కియా కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కియా కారులో ప్రయాణిస్తున్న వంశీ, నగేశ్‌కు తీవ్ర గాయాలవ్వగా శ్రీకాంత్, శ్రీధర్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు శంషాబాద్‌లోని లిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన లారీగా పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.


ప్రమాద స్థలిలో నుజ్జునుజ్జయిన కారు

సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

షాబాద్: సాంఘిక సమానత్వం కోసం జీవితాంతం శ్రమించిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు ఇచ్చిన ఘనమైన నివాళి అని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంత్యుత్సవాల సందర్భంగా ప్రిన్సిపాల్ వినోల, ఉపాధ్యాయినులను టీఎస్ఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు గౌతమి, క్రాంతి, రాధిక, జంగమ్మ తదితరులున్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎనిమిది మంది అరెస్ట్

మొయినాబాద్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. ఈ ఘటన మొయినాబాద్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. స్థానిక సురభి వెంచర్ సమీపంలోని ఓ గదిలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో గుడిమల్కాపూర్‌కు చెందిన చెంబేటి ఏడుకొండలు, శేరిలింగంపల్లికి చెందిన మల్లె ఏడుకొండలు, కొండాపూర్‌కు చెందిన కంచల అంకమ్మ, హిమాయత్‌నగర్‌కు చెందిన మసిపల్లి మాల్యాద్రి, బండ్లగూడకు చెందిన కంచల మురళి, మొయినాబాద్‌కు చెందిన వల్లపు కృష్ణ, జీవీ రమణ, కృష్ణారావు పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఎనిమిది మందిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.1,34,900 నగదు, 3 సెట్ల పేక ముక్కలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతూ దొరికినవారంతా మేస్త్రీ పనిచేస్తారని తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.26 కోట్లతో వంద పడకల ఆస్పత్రి

పరిగి: పరిగి ప్రభుత్వాస్పత్రిని 30 పడకల సామర్థ్యం నుంచి వంద పడకలకు పెంచేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం వెంటనే రూ.26 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. దీంతో పాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రతీ నియోజకవర్గంలో ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే నిధులతో ఆస్పత్రి ప్రహరీ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, డీసీహెచ్ఓ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

మీర్‌పేట: బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మృతి చెందాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. జిల్లెలగూడ డీఎస్ఆర్ కాలనీకి చెందిన కూరెళ్ల అనిల్‌కుమార్(26) ఫొటోగ్రాఫర్. ఈ నెల 1న సాయంత్రం 6.30గంటలకు స్నేహితుడు పవన్‌తో కలిసి చికెన్ తెచ్చేందుకు బీజేపీ క్వార్టర్స్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో బాలాపూర్ చౌరస్తా నుంచి మంద మల్లమ్మ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు అనిల్‌ను ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడుని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేశామని.. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు.


అనిల్‌కుమార్ (ఫైల్)